# వాస్తవం

సోమవారం
02.03.2026

డెయిలీ.కామ్

డిజిటల్ పత్రిక

ఉన్నది ఉన్నట్లుగా

ఎడిటర్: ఎం.కృష్ణారెడ్డి


## నేడు వికారాబాద్‌కు రాహుల్ గాంధీ



**హైదరాబాద్, మార్చి 1 :** లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సోమ వారం వికారాబాద్ జిల్లాకు రానున్నారు. వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్‌లో జరుగుతున్న ఏపీ, తెలంగాణ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి హాజరు అవుతున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఉదయం 9.30 గంటలకు ఢిల్లీ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి రాహుల్ చేరుకుంటారు. అక్కడ సీఎం రేవంత్‌రెడ్డి స్వాగతం పలుకుతారు. అక్కడి నుంచి సీఎంతో కలిసి అనంతగిరి వెళ్తారు. ఈ నెల 16న జరగనున్న రాజ్యసభ సభ్యుల ఎన్నికలకు సంబంధించి అభ్యర్థులను ప్రకటించే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

## భళా శాంసన్



- టీ20 ప్రపంచకప్‌లో సెమీస్‌కు భారత్
- నాకౌట్‌లో విండీస్‌పై ఘన విజయం
- శాంసన్ చిరస్మరణీయ ఇన్నింగ్స్
- ముగిసిన సూపర్-8 దశ

4లో..

భారత క్రికెట్ అభిమానుల ఉత్కంఠకు తెర! టీ20 ప్రపంచకప్‌లో సెమీస్ చేరాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా బ్యాట్‌తో అదరగొట్టింది. బంతితో అంచనాలను అందుకోలేకపోయినా బ్యాట్‌తో మాత్రం సత్తాచాటింది. భారత క్రికెట్ మక్కాగా పిలుచుకునే ఈడెన్ గార్డెన్స్‌లో వర్చువల్ నాకౌట్‌గా సాగిన పోరులో వెస్టిండీస్‌ను 5 వికెట్ల తేడాతో చిత్తుచేసి సెమీస్‌కు అర్హత సాధించింది.

## కూలగొట్టుడు..
# కొల్లగొట్టుడే
## రేవంత్ సర్కార్‌ది లూటిఫికేషన్

- శాడిస్టిక్ ప్లెజర్‌తోనే మూసీలో రేవంత్ విధ్వంసం: కేటీఆర్
- ప్రజలకు నీడ లేకుండా చేస్తున్న ముఖ్యమంత్రి
- బఫర్‌జోన్ పేరిట ఇండ్లు కూల్చి రియల్ దందా
- బీఆర్ఎస్ హయాంలో ఒక్క ఇంటినీ కూల్చలే
- 16 వేల కోట్లతో మూసీ మాడల్ చూపిన కేసీఆర్
- రియల్ ఎస్టేట్ వ్యాపారులకు దోచిపెట్టేందుకే మూసీ పేరిట
- కాంగ్రెస్ లక్షన్నర కోట్లు మింగే ప్లాన్
- అభివృద్ధికి కాదు, కమీషన్ల దందాకు మేం వ్యతిరేకం
- ధ్వజమెత్తిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- పరీవాహక ప్రజలకు అండగా ఉంటామని హామీ
- నిర్వాసితులకు మద్దతుగా 'మూసీ దండి మార్చ్'

4లో..



తనకు శాడిస్టిక్ ప్లెజర్ ఉన్నదని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డే ఒప్పుకొన్నాడని, ఆ శాడిస్టిక్ ప్లెజర్‌తోనే రాష్ట్రంలో విధ్వంసం సృష్టిస్తున్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కష్టపడి కొనుక్కున్న భూములు కొల్లగొట్టి, లోన్లు తెచ్చుకొని కట్టుకున్న ఇండ్లను కూల్చేసి, ప్రజలకు నిలువ నీడ లేకుండా చేయడమే రేవంత్‌రెడ్డికి ఉన్న శాడిస్టిక్ ప్లెజర్ అని నిప్పులు చెరిగారు.

## దద్దరిల్లిన
# గల్ఫ్ దేశాలు

**సుప్రీం లీడర్ ఖమేనీ మృతికి ప్రతీకారంగా ఇరాన్ భీకర దాడులు**

**ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై ఎటాక్..సైప్రస్‌లోని బ్రిటన్ స్థావరాలపైనా దాడి**



**టెహ్రాన్:** ఖమేనీ మృతి తర్వాత ఇరాన్ ప్రతీకార దాడులకు దిగింది. ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాలపై క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. ఇరాన్ దాడుల్లో దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం, ప్రసిద్ధ బుర్జ్ అల్ అరబ్, పామ్ జుమైరా హోటళ్లు దెబ్బతిన్నాయి. ఆదివారం పేలుళ్లతో ఎమిరేట్స్ దద్దరిల్లింది. బహ్రెయిన్‌లోని మనామా నగరంలో క్రౌన్ ప్లాజా హోటల్‌ను ఒక సూసైడ్ డ్రోన్ ధ్వంసం చేసింది. అలాగే ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌పై దాడిలో కొంతమంది పౌరులు మరణించినట్టు సమాచారం. దుబాయ్‌లో పలుచోట్లు పేలుళ్లు సంభవించినట్టు వార్తా కథనాలు వెలువడ్డాయి. పెద్ద పేలుడు శబ్దాలు తమకు కూడా వినిపించినట్టు సౌదీ అరేబియా రాజధాని రియాద్ ప్రజలు తెలిపారు. ఇక ఖతర్ రాజధాని దోహా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇజ్రాయెల్, బహ్రెయిన్, కువైట్, ఇరాక్‌లతోపాటు తొలిసారిగా ఒమన్‌పై కూడా డ్రోన్, క్షిపణులతో ఇరాన్ దాడులు చేసింది. ఒక్క మాటలో చెప్పాలంటే అమెరికా ఆస్తులు, స్థావరాలు కలిగి ఉన్న అరబ్ దేశాలన్నింటినీ ఇరాన్ లక్ష్యంగా చేసుకుంది. అలాగే సైప్రస్‌లో ఉన్న బ్రిటిష్ మిలిటరీ స్థావరాలు లక్ష్యంగా ఇరాన్ రెండు క్షిపణులతో దాడులు చేసింది.

**అమెరికా యుద్ధనౌకపై దాడి!**

ఖమేనీ హత్యకు ప్రతీకారంగా యూఎస్ఎస్ అబ్రహం లింకన్ యుద్ధనౌకపై దాడి చేసినట్టు ఇరాన్ ప్రకటించింది. 4 బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించినట్టు తెలిపింది. అయితే దీన్ని అమెరికా తోసిపుచ్చింది. గల్ఫ్ నదీ జలాల్లో మోహరించి ఉన్న ఈ నౌకకు సమీపంగా కూడా క్షిపణులు రాలేదని పేర్కొన్నది.

# ఆ తీర్పు చట్టవిరుద్ధం

**ఢిల్లీ మద్యం కేసులో ట్రయల్ కోర్టు తీర్పు అహేతుకం**

**సీబీఐ అధికారిపై చర్యలకు ఆదేశించడం దిగ్భ్రాంతికరం**

**కుట్ర కోణాన్ని ట్రయల్ కోర్టు విస్మరించింది: సీబీఐ**

**తీర్పుపై హైకోర్టులో సవాల్ చేసిన దర్యాప్తు సంస్థ**

**974 పేజీలతో రివిజన్ పిటిషన్..**

**9న విచారణ**

**న్యూఢిల్లీ, మార్చి 1 :** ఢిల్లీ మద్యం కేసులో ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును సీబీఐ.. ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేసింది. 974 పేజీలతో రివిజన్ పిటిషన్ దాఖలు చేసింది. ట్రయల్ కోర్టు తీర్పు అత్యంత విస్తుగొలిపేలా ఉందని, అది చట్టపరమైన తప్పిదాలతో కూడుకున్నదని పిటిషన్‌లో సీబీఐ పేర్కొంది. "చట్టవిరుద్ధం, అహేతుకం, ప్రాథమికంగానే లోపభూయిష్టం" అంటూ తీవ్రంగా స్పందించింది. 2021-2022 ఢిల్లీ మద్యం విధానంలో అక్రమాలు జరిగాయంటూ సీబీఐ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో అప్పటి ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, ఉప ముఖ్యమంత్రి సిసోడియా, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత సహా 23 మందిని నిందితులుగా చేర్చారు. సుదీర్ఘకాలం వీరిని తిహాడ్ జైలులో ఉంచారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసుకు సంబంధించి రౌస్ అవెన్యూ సీబీఐ ప్రత్యేక కోర్టు కీలక తీర్పునిచ్చింది. అందరూ నిర్దోషులేనని తీర్పునిస్తూ జడ్జి జితేంద్రసింగ్.. సీబీఐ తీరుపై కీలక వ్యాఖ్యలు చేశారు. దర్యాప్తు సంస్థ ఏ దశలోనూ తన విధిని సరిగా నిర్వర్తించలేదని, దర్యాప్తు అధికారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని తన తీర్పులో పేర్కొన్నారు. అయితే ఈ తీర్పుపై సీబీఐ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. తీర్పునిచ్చే సమయంలో అసలు కుట్ర కోణాన్ని ట్రయల్ కోర్టు విస్మరించిందని పేర్కొంది. "ప్రాసిక్యూషన్ సమర్పించిన బలమైన సాక్ష్యాధారాలను ట్రయల్ కోర్టు పక్కనబెట్టింది. ప్రధానంగా.. కేజ్రీవాల్, సిసోడియా, కవిత పాత్రను అంచనా వేయడంలో కోర్టు పొరబడింది. మద్యం సిండికేట్ల కోసం పాలసీని ఎలా మార్చారో వివరించే సాక్ష్యాలను పరిగణనలోకి తీసుకోలేదు. అలాగే, తీర్పునిచ్చే సందర్భంలో జడ్జి చేసిన వ్యాఖ్యలు దర్యాప్తు సంస్థ నిబద్ధతపై ప్రభావం చూపే ప్రమాదముంది" అని సీబీఐ పేర్కొంది. నిందితులు నిర్దోషులంటూ తీర్పు వెలువరించే సమయంలో ట్రయల్ కోర్టు జడ్జి చేసిన మౌఖిక వ్యాఖ్యలను కూడా సీబీఐ తన పిటిషన్‌లో ప్రస్తావించింది. 4నెలలుగా తాను కేవలం ఈ కేసు ఫైళ్లను చదవడానికే వెచ్చించానని జడ్జి పేర్కొన్నారని, దీనిని బట్టి ఆయన సాక్ష్యాధారాలను అత్యంత లోతుగా విశ్లేషించినట్లు అర్థమవుతోందని తెలిపింది. అయితే, కేసులో అభియోగాలు ఖరారు చేసే ప్రాథమిక దశలో సాక్ష్యాధారాలను అంత సుదీర్ఘంగా, లోతుగా విశ్లేషించడానికి చట్టరీత్యా అనుమతి లేదని గుర్తుచేసింది. కేజ్రీవాల్, సిసోడియా, కవిత పాత్రను విశ్లేషించడంలో ట్రయల్ కోర్టు విఫలమైందని



పేర్కొంది. మద్యం పాలసీ వెనుక ఉన్న భారీ కుట్రను మొత్తంగా చూడకుండా, విడి విడి అంశాలుగా పరిగణించడం వల్ల కేసు నీరుగారిందని ఆవేదన వ్యక్తం చేసింది. అలాగే, దర్యాప్తు అధికారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ట్రయల్ కోర్టు ఇచ్చిన ఆదేశాలపై సీబీఐ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది దర్యాప్తు సంస్థ నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసేలా ఉందని, ఆ ఆదేశాలపై స్టే ఇవ్వాలని కోరింది. సీబీఐ దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను ఈ నెల 9న జస్టిస్ స్వరణకాంత శర్మ నేతృత్వంలోని ధర్మాసనం విచారించనుంది.

## టీటీడీ చైర్మన్ పదవికి బీఆర్ నాయుడు రాజీనామా చేయాలి

**బీఆర్ నాయుడి వ్యాఖ్యలపై భూమన కౌంటర్**

తనపై డీప్ ఫేక్ వీడియోతో సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు చేసిన వ్యాఖ్యలపై మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. అది డీప్ ఫేక్ వీడియో కాదని అన్నారు. విచారణ జరిపిస్తే అసలు రంగు బయటపడుతుందని స్పష్టం చేశారు. టీటీడీ చైర్మన్ పదవికి బీఆర్ నాయుడు రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాజీనామా చేయకుంటే మరిన్ని వాస్తవాలు బయటకొస్తాయని హెచ్చరించారు.తాడేపల్లిలో భూమన కరుణాకర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్న వీడియో చూస్తుంటే హిందువుల హృదయాలు మండిపోతున్నాయని అన్నారు. 94 సంవత్సరాల టీటీడీ పాలక మండలి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అనైతిక చర్యలకు పాల్పడుతున్న వ్యక్తిని చైర్మన్‌గా నియమించారని ఆరోపించారు. ఈ ఘటన తర్వాత టీటీడీ చైర్మన్ పదవికి మౌనంగా రాజీనామా చేయాల్సింది.. కానీ ఆ నెపాన్ని వైసీపీపై నెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. వాత్సాయనుడికి వారసుడు ఈ నాయుడు అని అన్నారు. తమ హయాంలో జస్ట్ వాయిస్ బయటకు వస్తేనే పృథ్వీతో రాజీనామా చేయించామని గుర్తుచేశారు.జగన్, ఆయన కుటుంబంపై బీఆర్ నాయుడు దారుణంగా మాట్లాడారని భూమన తెలిపారు. దీనికి ప్రతిఫలంగా దేవుడే బీఆర్ నాయుడికి శిక్ష వేశారని అన్నారు. ఫొటోలు, వీడియోలు బయటకు రావడం భగవంతుడి శిక్షేనని వ్యాఖ్యానించారు. పాపాల ఊబిలో చిక్కు




కున్న బీఆ ర్ నాయుడిని చంద్రబాబు ఏం చేస్తారని ప్రశ్నించారు. చంద్రబాబుకు భక్తి అనేది ఒక నాటకమే అని అన్నారు. బీఆర్ నా యుడిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# చలో హైదరాబాద్ విజయవంతం చేయండి

**రాష్ట్ర ప్రభుత్వం మెమో 57 అమలు చేయాలి**

**కోర్టు తీర్పులకు గౌరవం ఇవ్వాలి**

**2003 డీఎస్సీ అభ్యర్థుల గజ్వేల్ డివిజన అధ్యక్షులు కుకునూరి శేఖర్**

**మార్కుక్ : వాస్తవం :**

2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింప చేయాలంటూ మార్చి 7న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ సమీపంలో నిర్వహించనున్న మహా విజ్ఞాపన సభను విజయవంతం చేయాలని 2003 డీఎస్సీ గజ్వేల్ డివిజన్ అధ్యక్షుడు కుకునూరి శేఖర్ పిలుపునిచ్చారు. ఆదివారం మర్కూక్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.కేంద్ర ప్రభుత్వం 1 జనవరి 2004 నుంచి కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని అమలు చేసినప్పటికీ, 2004కు ముందు నోటిఫికేషన్ వచ్చి నియామకం ఆలస్యమైన ఉద్యోగులకు మెమో 57/4, 57/5 ఆధారంగా పాత పెన్షన్ వర్తింప చేస్తామని స్పష్టం చేసిందన్నారు. ఇదే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం కూడా అమలు చేయవచ్చని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఇప్పటికే 16 రాష్ట్రాలు మెమో 57ను అమలు చేస్తున్నాయని తెలిపారు. కోర్టుల స్పష్టమైన ఆదేశాలు ఈ అంశంపై ఉపాధ్యాయులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా, గత సంవత్సరం జూలై 29న 2004 సెప్టెంబర్ 1కు ముందు నోటిఫికేషన్ వచ్చి తర్వాత నియామకమైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని తీర్పు వెలువరించిందన్నారు. దేశ సర్వోన్నత న్యాయ స్థానం అయిన సు



ప్రీంకోర్టు కూడా ఇదే దిశగా స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చిందని చెప్పారు. 2004 సెప్టెంబర్ 1కు ముందు నోటిఫికేషన్ పొందిన వారు తమ నియామక పత్రాలు, జాయినింగ్ వివరాలు, సేవా ధృవ పత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలి. కోర్టు తీర్పుల ప్రతులను పరిశీలించి, అవసరమైతే న్యాయసహాయం పొందాలి.సంఘం ద్వారా జరుగుతున్న చర్చలు, ప్రభుత్వ ఉత్తర్వులపై తాజా సమాచారం తెలుసుకుంటూ ఐక్యంగా ఉండాలి.మార్చి 7న జరిగే మహా విజ్ఞాపన సభలో హాజరై తమ హక్కుల సాధనకు మద్దతు తెలియజేయాలి.రాష్ట్ర ప్రభుత్వం కోర్టు ఉత్తర్వులను వెంటనే అమలు చేసి 2003 డీ ఎస్సీ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని శేఖర్ డిమాండ్ చేశారు. జిల్లాలోని మరియు గజ్వేల్ డివిజన్ పరిధిలోని ఉపాధ్యాయులు పెద్దఎత్తున పాల్గొని చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలకిషన్, నాగరాజు తదితరులు ఉన్నారు.

# అమరుల త్యాగాలు వెలకట్టలేనివి

**వాస్తవం : అడ్డగూడూరు :**

వర్గీకరణ కోసం అసువులు బాసిన మాదిగ అమరవీరుల త్యాగాలు వెల కట్టలేనివని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు సూరారం రాజు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్సి ఉప కులాల్లో ఉన్న విద్య, ఉద్యోగ నియామకాలలో అసమానతలు, అంటరానితనం నిర్మూలనకై ఏర్పడిన ఎమ్మార్పీఎస్, వర్గీకరణ కోసం 30 ఏళ్ల నుంచి పోరాడి ఆదే మార్గంలో అమరులైన మాదిగ అమర వీరులను మననం చేసుకుందామని ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. 30



ఏళ్ల సుదీర్ఘ పోరాటంలో అమరుల త్యాగ ఫలితమే నేటి వర్గీకరణ అమలు అని, అమరుల పోరాటాన్ని స్మరించుకుంటూ వారికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బాలెంల నరేష్ , అధికార ప్రతినిధి పనుమటి సతీష్, మోత్కూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలెంల విద్యసాగర్, ఎమ్మార్పీఎస్ మాజి అధ్యక్షులు గజ్జెల్లి రవి, ఎమ్మార్పీఎస్ సభ్యులు నీర్మాల వెంకన్న, గజ్జెల్లి కృష్ణ, బాలెంల బాబు, బోడ పాండు, పనికెర సూర్య, బాలెంల బాబు, బాలెంల మల్లయ్య, చుక్క అంజయ్య, మందుల రాము, గూడెపు నవీన్, గూడెపు ఉమేష్, బోడ ఉత్తరయ్య పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో ఆది శ్రీనివాస్



**వాస్తవం : కోనరావుపేట**

కోనరావుపేట మండలం మర్తన్నపేట, మల్కపేట గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారికి నూతన వస్త్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ ఎస్సై ఇస్మాయిల్‌ను పరామర్శించిన వంటేరు ప్రతాప్ రెడ్డి

**- బకాయిల కోసం అలమటిస్తున్న 37 ఏళ్ల సేవాధికారి**

**- గ్రాట్యుటీ, పెన్షన్ చెల్లింపుల్లో జాప్యం**

**- అనారోగ్యంతో మరింత క్లిష్టమైన పరిస్థితి**

**- కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్**

**వాస్తవం, గజ్వేల్ ఆర్ సి :**

అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితిలో ఉన్న రిటైర్డ్ ఎస్సై ఇస్మాయిల్ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. పెండింగ్ బకాయిలు అందక పరిస్థితి మరింత క్లిష్టమైందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు శాఖలో 37 సంవత్సరాలు సేవలందించిన ఇస్మాయిల్ రిటైర్మెంట్ అనంతరం రావలసిన గ్రాట్యుటీ, పెన్షన్, ఇతర బకాయిల కోసం ఎదురుచూస్తున్నారు. చెల్లింపులు జాప్యం కావడంతో నిత్యావసర ఖర్చులు కూడా భరించడం కష్టసాధ్యమైందని తెలిపారు. కుటుంబ పోషణ భారంగా మా



రిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి ఆదివారం వారి నివాసానికి వెళ్లి ఇస్మాయిల్‌ను పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ... కానిస్టేబుల్‌గా విధులు ప్రారంభించి ఎస్సై స్థాయికి ఎదిగిన ఇస్మాయిల్ 37 ఏళ్లపాటు శాంతి భద్రతల పరిరక్షణలో నిబద్ధతతో సేవలందించారు. అలాంటి ఉద్యోగి రిటైర్మెంట్ తర్వాత బకాయిల కోసం ఎదురు చూడాల్సి రావడం బాధాకరం. కాంగ్రెస్ ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి రావలసిన గ్రాట్యుటీ, పెన్షన్, ఇతర పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలి అని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండకూడదు అన్నారు. సేవలందించిన వారిని గౌరవించకపోతే వ్యవస్థపై ప్రజల నమ్మకం దెబ్బతింటుంది అని ఆయన పేర్కొన్నారు. ఇస్మాయిల్ తన ఆవేదన వ్యక్తం చేస్తూ, వైద్యం చేయించుకోవడానికి కూడా ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. పెండింగ్ చెల్లింపులు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, కౌన్సిలర్ మామిడి శ్రీధర్, గోలి సంతోష్, మాజీ కౌన్సిలర్ రహీం, యూత్ అధ్యక్షుడు స్వామి చారి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో పోలీస్ యాక్ట్ అమలు

**రాజన్న సిరిజిల్లా ఎస్పీ మహేష్ బిగితే**

**వాస్తవ: రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)**



శాంతి భద్రతలను దృష్టిలో పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం నెల రోజుల (మార్చ్ 1వ తేది నుండి 31 వరకు)పాటు రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గితే తెలిపారు.దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు,ర్యాలిలు, పబ్లిక్ మీటింగ్ లు,సభలు, సమావేశాలు నిర్వహించరాదని, నిబంధనలకు విరుద్దీదంగా డి.జే వినియోగించారాదని తెలిపారు. శాతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తుల కు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్ట రాదని సూచించారు.కాబట్టి జిల్లా ప్రజలు పోలీసు వారికి ఈ విషయంలో సహకరించాలని శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.

వాస్తవం



# జ్ఞానానికి దిక్సూచి శంకరాచార్యులు

**- వైరాగ్య శిఖామణి అవధూత**
**- ఈనెల 5న విగ్రహావిష్కరణ**
**- హాజరుకానున్న మంత్రి దామోదర రాజనర్సింహ**



**వాస్తవం : సంగారెడ్డి పతినిధి :**

సనాతన ధర్మ పరిరక్షణలో విశిష్ట స్థానం జగద్గురు ఆది ఆదిశంకరాచార్యులని భారతీయ ఆధ్యాత్మిక లోకంలో చిరస్థాయిగా నిలిచారని సంగారెడ్డి జిల్లా బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమం పీఠాధిపతి వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్ తెలిపారు. అద్భుతమైన జ్ఞానం, తత్వచింతనతో అద్వైత వేదాంతాన్ని ప్రపంచానికి పరిచయం చేసి, "బ్రహ్మం ఒక్కటే సత్యం" అనే సిద్ధాంతాన్ని బోధించారని పేర్కొన్నారు. ఆశ్రమ ఆవరణంలో ఈ నెల 5న జరిగే దత్తగిరి మహారాజ్ అమర తిథి సందర్భంగా ఆది శంకరాచార్యుల విగ్రహావిష్కరణకు సంబంధించి గోడపత్రికను ఆవిష్కరించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో దత్తగిరి చారిటబుల్ ట్రస్ట్ తరపున ఆది శంకరాచార్యులకు సంబంధించిన 108 విగ్రహాలను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ హాజరుకానున్నారని వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజు, నాయకులు నీలా వెంకటేశం, నాగన్న పాటిల్, అంజన్న వైదిక పాఠశాల విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

# మల్లికార్జునస్వామి ఆశీస్సులు రామగుండం ప్రజలపై ఉండాలి

**మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్**



**వాస్తవం : గోదావరిఖని**

మల్లికార్జునస్వామి వారి ఆశీస్సులు రామగుండం ప్రజలపై ఉండాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బీ.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. అదివారం అంతర్గాం మండలం మట్టుర్మ్మార్ కోమురన్న జాతర శ్రీ మల్లికార్జున స్వామి వారి విగ్రహాల ప్రతిష్టాపనలో మాజీ ఎమ్మెల్యే పాల్గొన్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఎటా ఎంతో ఘనంగా నిర్వహించే ముర్మ్మార్ కోమురన్న జాతరకు ఒక ప్రత్యేకత ఉందన్నారు. మల్లికార్జున స్వామి వారి దేవాలయం నిర్మాణం చేయడం సంతోషకరమన్నారు.

# ఘనంగా మాస్టర్ మైండ్ స్కూల్ సైన్స్ ఎగ్జిబిషన్




**వాస్తవం: శేర్లింగంపల్లి :** నేషనల్ సైన్స్ ఎగ్జిబిషన్ డేను పురస్కరించుకొని ప్రగతి ఎంక్లేవ్, మియాపూర్‌లోని 'ది మాస్టర్ మైండ్స్ స్కూల్' వారు ప్రతి సంవత్సరం విద్యార్థుల ద్వారా సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తారు. ఈ సంవత్సరం కూడా సైన్స్ ప్రదర్శన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా అట్టేపల్లి రామప్రభు హాజరై విద్యార్థుల ప్రదర్శనలను సందర్శించి, వారి ప్రతిభను అభినందించి, ప్రోత్సాహకరమైన సందేశాన్ని అందించారు. ఈ సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు తమ సృజనాత్మకత, విజ్ఞానం మరియు ప్రతిభను ప్రదర్శించారు. ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు తమ ఆలోచనలు, ప్రయోగాలు ప్రదర్శించేందుకు మంచి అవకాశం కల్పిస్తున్నామని పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఈ ప్రదర్శనను వీక్షించేందుకు విద్యార్థుల తల్లిదండ్రుల తో పాటు కాలనీలోని ప్రముఖులు కూడా హాజరై పిల్లలను ప్రోత్సహించారు.

# పద్మశాలి సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు




**వాస్తవం : కొడిమ్యాల**

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం చెప్యాల గ్రామంలో ఆదివారం పద్మశాలి సంఘం నూతన కార్యవర్గని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు .పద్మశాలి సంఘం అధ్యక్షులుగా వడ్లకొండ మల్లేశం ,ఉపాధ్యక్షులు ఈగ సత్తయ్య, ప్రధాన కార్యదర్శి అడిగొప్పుల శ్రీధర్, కోశాధికారి అడిగొప్పుల తులసి రామ్ కార్యదర్శిగా గోనె మహిపాల్, ముఖ్య సలహాదారులుగా గాలిపెల్లి అంజయ్య, ఈగ మల్లేశం లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులందరూ పాల్గొన్నారు.

# చింతకానిలో పురాతన విష్ణుమూర్తి విగ్రహం వెలికితీత

**వాస్తవం:కాటారం**

కాటారం మండలం చింతకాని గ్రామ పరిధిలోని రోటీపొదాల ప్రాంతంలోని వాగులో విష్ణుమూర్తి అవతారాన్ని పోలి ఉన్న పురాతన చెన్నకేశవ స్వామి విగ్రహం వెలుగులోకి వచ్చింది. స్థానికులు విగ్రహాన్ని బయటకు తీసి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ విషయం తెలిసి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. విగ్రహం బయట పడటంతో ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. చింతకానిలో వెలసిన శ్రీ చెన్నకేశవ స్వామి విగ్రహాన్ని పోలి ఉన్న ఈ శిల్పంపై విష్ణుమూర్తి దశావతారాలు చెక్కబడి ఉండటం విశేషం. శంఖ, చక్ర, గద, పద్మాలను ధరించిన స్వామివారి రూపం భక్తులను ఆకట్టుకుంటోంది. పురాతన కాలానికి చెందిన ఈ విగ్రహాన్ని దర్శించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.



## సిరిసిల్ల మున్సిపల్ పాలకవర్గం కీలక నిర్ణయం

# రూ.101 కే దహన సంస్కారాలు

**వాస్తవం: సిరిసిల్ల**



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సామాన్యులకు ఊరటనిచ్చేలా మున్సిపల్ పాలకవర్గం ఒక గొప్ప నిర్ణయాన్ని తీసుకుంది. పట్టణంలో కేవలం రూ. 101కే అంతిమ సంస్కారాలు నిర్వహించే పథకాన్ని తిరిగి పునఃప్రారంభిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ ప్రకటించారు. మున్సిపల్ కార్యాల యంలో నిర్వహించిన నూతన పాలకవర్గ తొలి సాధారణ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. నేటి నుంచే ఈ పథకం అమల్లోకి వస్తుందని చైర్‌పర్సన్ స్పష్టం చేశారు. గ తంలో అనివార్య కారణాల వల్ల ఆగి పోయిన ఈ పథకాన్ని ప్రజల ప్రయోజనం దృష్ట్యా తొలి సమావేశంలోనే పునఃప్రా రంభించాలని నిర్ణయించారు. పట్టణ అభివృద్ధి తమ ప్రథమ లక్ష్యమని, ఇందులో భాగంగా మొత్తం 12 అంశాలకు పాలక వర్గం ఆమోదం తెలిపింది. పట్టణంలో పారిశుధ్యాన్ని మెరుగు పరచడానికి 'స్పెషల్ శానిటేషన్ డ్రైవ్' కోసం రూ. 10 లక్ష లు కేటాయించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని పవర్ బోర్ల మరమ్మతులకు రూ. 10 లక్షలు, స్ట్రీట్ లైట్లు, ఇతర మెటీరియల్ కొనుగోలుకు రూ. 5 లక్షలు వెచ్చించనున్నారు.

# కట్ట మైసమ్మ ఆలయ విగ్రహం ప్రతిష్టాపన

**వాస్తవం : మద్నూర్:**



కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల కేంద్రంలోని సోమలింగాల గుట్టకు వెళ్లే దారిలో గల కట్ట మైసమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం ఆదివారం భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ముందుగా వేదమంత్రోచ్చర ణలతో పూజలు చేపట్టారు. హారతి అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. పురాతన ఈ కట్ట మైసమ్మ ఆలయం శిథిలావస్థలోకి చేరడంతో ప్రత్యేకంగా ఇనుప జాలి ఏర్పాటు చేసిన పునరుద్ధరణ చేయడం జరిగిందని సంతోష్ సేట్ నార్లవార్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో పండుగ వాతావరణం నెల కొంది.

వాస్తవం



# భళా శాంసన్



- టీ20 ప్రపంచకప్‌లో సెమీస్‌కు భారత్
- నాకౌట్‌లో విండీస్‌పై ఘన విజయం
- శాంసన్ చిరస్మరణీయ ఇన్నింగ్స్
- ముగిసిన సూపర్-8 దశ

**భారత క్రికెట్ అభిమానుల ఉత్కంఠకు తెర! టీ20 ప్రపంచకప్‌లో సెమీస్ చేరాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా బ్యాట్‌తో అదరగొట్టింది. బంతితో అంచనాలను అందుకోలేకపోయినా బ్యాట్‌తో మాత్రం సత్తాచాటింది. భారత క్రికెట్ మక్కాగా పిలుచుకునే ఈడెన్ గార్డెన్స్‌లో వర్చువల్ నాకౌట్‌గా సాగిన పోరులో వెస్టిండీస్‌ను 5 వికెట్ల తేడాతో చిత్తుచేసి సెమీస్‌కు అర్హత సాధించింది.**

**కోల్‌కతా :** భారత క్రికెట్ అభిమానుల ఉత్కంఠకు తెర! టీ20 ప్రపంచకప్‌లో సెమీస్ చేరాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా బ్యాట్‌తో అదరగొట్టింది. బంతితో అంచనాలను అందుకోలేకపోయినా బ్యాట్‌తో మాత్రం సత్తాచాటింది. భారత క్రికెట్ మక్కాగా పిలుచుకునే ఈడెన్ గార్డెన్స్‌లో వర్చువల్ నాకౌట్‌గా సాగిన పోరులో వెస్టిండీస్‌ను 5 వికెట్ల తేడాతో చిత్తుచేసి సెమీస్‌కు అర్హత సాధించింది. విండీస్ నిర్దేశించిన 196 పరుగుల భారీ ఛేదనలో వికెట్‌కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ (50 బంతుల్లో 97 నాటౌట్, 12 ఫోర్లు, 4 సిక్స్‌లు) తన కెరీర్‌లోనే అత్యంత విలువైన ఇన్నింగ్స్ ఆడి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. అతడి మెరుపులతో ఛేదనను సూర్య సేన..19.2 ఓవర్లలో 5 వికెట్లు మాత్రమే కోల్పోయి దంచేసింది. శాంసన్‌కే 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. అంతకుముందు భారత ఆహ్వానం మేరకు మొదట బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ సమష్టిగా ఆడి 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 195 రన్స్ చేసింది. రోస్టన్ ఛేజ్ (25 బంతుల్లో 40, 5 ఫోర్లు, 1 సిక్స్), జేసన్ హోల్డర్ (22 బంతుల్లో 37 నాటౌట్, 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), రోవ్‌మన్ పావెల్ (19 బంతుల్లో 34 నాటౌట్, 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), షై హోప్ (32) రాణించారు. ఈ ఓటమితో విండీస్ టోర్నీ నుంచి నిష్క్రమించింది.

### భళా శాంసన్

ఛేదనలో అభిషేక్ (10) మరోసారి స్పిన్ ఉచ్చులో చిక్కుకుని నిరాశపరచగా హోల్డర్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడబోయిన ఇషాన్ కిషన్ (10) సైతం అతడినే అనుసరించాడు. ఈ క్రమంలో సంజూ, కెప్టెన్ సూర్య (18) జట్టును ఆదుకున్నారు. అకీల్ రెండో ఓవర్లో ఫోర్, రెండు సిక్స్‌లతో పరుగుల వేట ఆరంభించిన శాంసన్.. తన కెరీర్ ఊగిసలాటల




నడుమ మరో చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడాడు. అనవసర షాట్లు ఆడి వికెట్ సమర్పించుకునే అలవాటున్న అతడు.. ఈ మ్యాచ్‌లో అలాంటి తప్పిదాలకు చోటివ్వకుండా ఇన్నింగ్స్ ఆసాంతరం బాధ్యతతో ఆడాడు. షెఫర్డ్ ఓవర్లో లాంగాన్ మీదుగా 6, 4 బాదిన అతడు.. బౌండరీతో 26 బంతుల్లోనే తన తొలి టీ20 వరల్డ్ కప్ అర్ధ శతకం నమోదు చేశాడు. 11వ ఓవర్లో బంతినందుకున్న జోసెఫ్.. సూర్యను ఔట్ చేసి 58 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరదించాడు. 10-12 ఓవర్ల మధ్య స్కోరు వేగం నెమ్మదించడంతో పాటు ఛేదించాల్సిన రన్‌రేట్ పెరుగుతుం డటంతో సంజూ, సూర్య స్థానంలో వచ్చిన తిలక్ గేర్ మార్చారు. జోసెఫ్ ఓవర్లో తిలక్ హ్యాట్రిక్ ఫోర్లు బాదాడు. ధాటిగా ఆడే క్రమంలో తిలక్.. డ్రింక్స్ విరామం తర్వాత హెట్‌మెయర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అయితే అప్పటికే క్రీజులో పాతుకుపోయిన సంజూ.. హార్దిక్ పాండ్య (17), శివమ్ దూబె (8లి) అండతో జట్టును విజయతీరాలకు చేర్చాడు.

### నిలకడ.. మెరుపులు

ఆరంభంలో ఆచితూచి ఆడిన విండీస్ బ్యాటర్లు క్రీజులో కుదురుకున్నాక మెరుపులు మెరిపించి.. ఆఖర్లో తమ మార్కు విధ్వంసంతో ఫినిషింగ్ టచ్ ఇచ్చారు. స్టార్ పేసర్ బుమ్రా మినహా నాసిరకంగా కనిపించిన భారత బౌలింగ్, ఫీల్డింగ్ తప్పిదాలను ఆసరాగా చేసుకుని పక్కా ప్రణాళికతో భారీ స్కోరు సాధించారు. ఓపెనర్‌గా ప్రమోట్ అయిన రోస్టన్ ఛేజ్.. కెప్టెన్ షై హోప్‌తో కలిసి పవర్ ప్లేలో భారత బౌలింగ్ దళాన్ని సమర్థవంతంగా ఎదుర్కొన్నాడు. భారీ మెరుపులేమీ లేకపోయినా పవర్ ప్లేలో వికెట్లేమీ కోల్పోకుండా 45 రన్స్ చేసిన విండీస్.. 9వ ఓవర్లో తొలి వికెట్‌ను కోల్పోయింది. హోప్‌ను వరుణ్ బౌల్డ్ చేశాడు. బుమ్రా 12వ ఓవర్లో ప్రమా దకర హెట్‌మెయర్ (27)తో పాటు ఛేజ్‌నూ ఔట్ చేశాడు. హార్దిక్ ఓవర్లో రూథర్‌ఫర్డ్ (14) కూడా నిష్క్రమించాడు. అతడు ఔటయ్యే సమయానికి విండీస్ స్కోరు 14.1 ఓవర్లకు 119/4గానే ఉం ది. కానీ ఆఖరి ఐదు ఓవర్లలో కరీబి యన్లు ఏకంగా 70 రన్స్ పిండుకున్నారు. హోల్డర్, పావెల్ అభేద్యమైన ఐదో వికెట్‌కు 35 బంతుల్లోనే 76 పరుగులు జోడించి భారత్ ఎదుట భారీ లక్ష్యాన్ని నిలిపారు.

### సెమీస్‌లో ఇలా..

భారత్, వెస్టిండీస్ మ్యాచ్‌తో ప్రపంచ కప్‌లో సూపర్-8 దశకు శుభం కార్డు పడింది. గ్రూప్-1 నుంచి దక్షిణాఫ్రికా, భారత్.. గ్రూప్-2 నుంచి ఇంగ్లండ్, న్యూజిలాండ్ సెమీస్ చేరాయి. గ్రూప్-2 నుంచి పాక్ నిష్క్రమించడంతో రెండు సెమీస్ మ్యాచ్‌లతో పాటు ఫైనల్ కూడా భారత్‌లోనే జరుగనుంది. మార్చి 4న సౌతాఫ్రికా.. కోల్‌కతా వేదికగా న్యూజిలాండ్‌తో తలపడనుండగా ఆ మరుసటి రోజున ఇంగ్లండ్.. ముంబైలో టీమ్ ఇండియాతో అమీతుమీ తేల్చుకోనుంది. సెమీస్‌లో గెలిచిన జట్లు ఈనెల 8న అహ్మదాబాద్‌లో టైటిల్ పోరులో తలపడతాయి.

# కూలగొట్టుడు..కొల్లగొట్టుడే

**శాడిస్టిక్ ప్లెజర్‌తోనే మూసీలో రేవంత్ విధ్వంసం: కేటీఆర్**

**ప్రజలకు నీడ లేకుండా చేస్తున్న ముఖ్యమంత్రి**

**బఫర్‌జోన్ పేరిట ఇండ్లు కూల్చి రియల్ దందా**

**బీఆర్ఎస్ హయాంలో ఒక్క ఇంటినీ కూల్చలే**

**16 వేల కోట్లతో మూసీ మాడల్ చూపిన కేసీఆర్**

**రియల్ ఎస్టేట్ వ్యాపారులకు దోచిపెట్టేందుకే మూసీ పేరిట కాంగ్రెస్ లక్షన్నర కోట్లు మింగే ప్లాన్**

**అభివృద్ధికి కాదు, కమీషన్ల దందాకు మేం వ్యతిరేకం**

**ధ్వజమెత్తిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**పరీవాహక ప్రజలకు అండగా ఉంటామని హామీ**

**నిర్వాసితులకు మద్దతుగా 'మూసీ దండి మార్చ్'**

హైదరాబాద్ , మార్చి 1 : తనకు శాడిస్టిక్ ప్లెజర్ ఉన్నదని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డే ఒప్పు కొన్నాడని, ఆ శాడిస్టిక్ ప్లెజర్‌తోనే రాష్ట్రంలో విధ్వంసం సృష్టిస్తున్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కష్టపడి కొనుక్కున్న భూములు కొల్లగొట్టి, లోన్లు తెచ్చుకొని కట్టుకున్న ఇండ్లను కూల్చేసి, ప్రజలకు నిలువ నీడ లేకుండా చేయడమే రేవంత్‌రెడ్డికి ఉన్న శాడిస్టిక్ ప్లెజర్ అని నిప్పులు చెరిగారు.'శాడిస్టిక్ ప్లెజర్ ఉన్న రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఇండ్లు కూలగొట్టడమే పనిగా పెట్టుకున్నడు. అధికారంలోకి రాగానే హైడ్రా పేరుతో వందల మంది ఇండ్లు కూలగొట్టి పేదలను రోడ్డున పడేసిండు. రామగుం డం, మహబూబ్‌నగర్, ఖమ్మం వంటి ప్రాంతాల్లో ఇండ్లు కూల్చి వేలాది మంది బతుకులను ఆగం చేసిండు' అంటూ తూర్పారబట్టారు. మూసీ బఫర్ జోన్ పేరిట హైదర్‌షా కో ట్, గంధంగూడలోని పలు కాలనీల్లో ఇండ్లను ఖాళీ చేయాలని ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చి న నేపథ్యంలో ఆదివారం నిర్వహించిన మూడున్నర కిలోమీటర్ల 'మూసీ దండి మార్చ్' పాదయాత్రలో కేటీఆర్ పాల్గొన్నారు.మూసీ ప్రాజెక్టులో భాగంగా ఇండ్లు, భూములు, అ పార్ట్ మెంట్లు కోల్పోతున్న బాధితులను కలిసి సంఘీభావం తెలిపారు. సంబంధిత కాలనీల ప్రజలకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో కేటీఆర్ మాట్లాడుతూ రూ.లక్షన్నర కోట్లతో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నది మూసీ బ్యూటిఫికేషన్ కాదని, లూటిఫికేషన్ అని మండిపడ్డారు. అభివృద్ధికి బీఆర్ఎస్ ఎప్పటికీ అడ్డుకాదని, అభివృద్ధి పేరిట ప్రజల ఇండ్లను కూలుస్తా మంటే ఎట్టిపరిస్థితుల్లో ఊరుకోబోమని తేల్చిచె ప్పారు. 'ప్రజల ఇండ్ల జోలికి వస్తే బుల్డోజర్లకు అడ్డంగా పడుకొనైనా కాపాడుకుంటాం.. గోడలను కాదు.. సున్నం కూడా ముట్టుకోనివ్వం' అని స్పష్టంచేశారు. రేవంత్‌రెడ్డికి తెలిసిన పాలన కేవలం ఇండ్లు కూలగొట్టడం, భూములు కొల్లగొట్టడం.. రియల్ ఎస్టేట్ దందా చేయడం. ఈ వ్యాపారంలో వచ్చే కమీషన్ల కోసం పేదల జీవితాలను పూర్తిగా నాశనం చేసేందుకు కంకణం కట్టుకున్నడు. ఇండ్లు కోల్పోతున్న బాధితులంతా చిన్నాపెద్దా తేడా లేకుండా ఎన్నిరకాలుగా ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసినా, వేడుకున్నా, చివరికి పసిపాపలపై కనికరం చూపాలని కోరినా కరశంగా ఖాళీ చేయిస్తున్నది. ఇండ్లు కూలగొట్టడం, భూములు ఆక్రమించడం, రియల్ ఎస్టేట్ దందా చేయడమే రేవంత్‌రెడ్డికి తెలిసిన పాలన అని కేటీఆర్ మండిపడ్డారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో వచ్చే కమీషన్ల కోసం పేదల జీవితాలను పూర్తిగా నాశనం చేసేందుకు కంకణం కట్టుకున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పసిపిల్లలు ఉన్నారన్న కనికరం కూడా లేకుండా బెదిరింపులకు గురి చేస్తూ ఇండ్లు ఖాళీ చేయిస్తున్నాడని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజల ఇండ్లు కూలగొట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడమే రేవంత్‌రెడ్డి పనిగా పెట్టుకున్నాడని ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక ప్రాజెక్టో, ఇల్లో కట్టింది లేదని, కనీసం ఒక్క రోడ్డు కూడా వేయలేదని, కేవలం విధ్వంసమే తన విధానంగా ముందుకు పోతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇండ్లు, భూములు కాపాడుకొనే పోరాటంలో బీఆర్ఎస్ మీకు అండగా ఉంటది' అని బాధితులకు భరోసా ఇచ్చారు.'కేసీఆర్ కట్టించిన అద్భుతమైన ప్రగతి భవన్ ఉన్నా ముఖ్యమంత్రి తన కోసం రూ.200 కోట్లతో ఇల్లు కట్టుకుంటున్నడు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోసం ప్రగతి భవన్‌ను కేటాయించినా హైదరాబాద్‌లో ఒక ఇల్లు, ఖమ్మం జిల్లాలో మరో ఇల్లు క్యాంపు కార్యాలయం కోసం కట్టుకుంటున్నడు. కోట్లాది రూపాయల ప్రజాధనంతో ముఖ్యమంత్రి రెండ్లు, ఉప ముఖ్యమంత్రికి మూడు ఇండ్లు కట్టుకోవచ్చు. పైసాపైసా కూడబెట్టుకొని, బ్యాంకుల్లో లోన్లు తెచ్చుకొని సొంతింటి కల నెరవేర్చుకున్న పేద, మధ్యతరగతి ప్రజలకు మాత్రం ఒక్క ఇల్లు ఉండొద్దా?' అని కేటీఆర్ నిలదీశారు. 'రేవంత్‌రెడ్డికి, ఆయన అన్నదమ్ములకు మాత్రం రూ.వందల కోట్ల ఇండ్లు కావాలి కానీ పేదలు, మధ్యతరగతి వారికి ఒక అపార్ట్‌మెంట్ ఉండకుండా విధ్వంసం సృష్టిస్తున్నడు' అంటూ నిప్పులు చెరిగారు.'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇల్లు కొడంగల్‌లోని రెడ్డికుంట ఎఫ్‌టీఎల్‌లోనే ఉన్నది. అన్ని అనుమతులున్న ప్రజల ఇండ్లను కాదు.. ముందుగా ముఖ్యమంత్రి ఇంటిని కూల్చాలి. హైదరాబాద్‌లోని దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌లో సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి ఇల్లు ఉన్నది. ఆయన ఇంటిని ఎందుకు కూల్చడం లేదు? మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి ఇండ్లు హైదరాబాద్‌కు మంచినీళ్లు ఇచ్చే జంట జలాశయాల ఎఫ్‌టీఎల్‌లో ఉన్నయి. వారి ఇండ్లను ముందుగా కూల్చాలి. అవన్నీ చేయకుండా పేద, మధ్యతరగతి ప్రజల ఇండ్లను అకారణంగా కూలుస్తూ విధ్వంసానికి పాల్పడుతున్నరు' అంటూ కేటీఆర్ ధ్వజమెత్తారు. పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో ఒక్క ఇల్లు కూల్చకుండా, ఒక్క ఇటుక కదుపకుండా కేసీఆర్ మూసీ సుందరీకరణ చేసి చూపించారని కేటీఆర్ తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో కేవలం రూ.16 వేల కోట్లతోనే మూసీ సుందరీకరణ చేయవచ్చని డీపీఆర్ తయారు చేసి మరీ చూపారని గుర్తుచేశారు. నాగోల్ ప్రాంతంలో మూసీని సుందరీకరించి మాడల్‌గా చూపించామని చెప్పారు. కేవలం సుందరీకరణ మాత్రమే కాకుండా రోడ్లతో పాటు ఫ్లై ఓవర్లను కూడా ప్రణాళికలో పెట్టామని తెలిపారు. మూసీ పొడవునా ఓఆర్ఆర్‌కు చేరుకునేందుకు అత్యంత పొడవైన ఫ్లై ఓవర్ నిర్మాణానికి రూ.10 వేల కోట్లతో ప్రణాళికలు రూపొందించామని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం రియల్ ఎస్టేట్ వ్యాపారాల కోసం, తన అనుచరులు, అన్నదమ్ములు, కుటుంబ సభ్యులకు కాంట్రాక్టులు ఇవ్వడం కోసం మూసీ పేరుతో భారీ స్కామ్‌కు తెరలేపారని విమర్శించారు. ఇందుకు పేదల ఇండ్లను పణంగా పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రూ.లక్షన్నర కోట్ల దోపిడీ కోసం వేల మంది పేదల ఇండ్లను ధ్వంసం చేస్తూ రేవంత్ రెడ్డి కొత్త స్కామ్‌కు తెరలేపాడని విమర్శించారు. 'మూసీ బఫర్‌జోన్‌కు సంబంధించి రకరకాల మాటలు చెప్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఆరోజు అధికారంలో ఉన్నప్పుడు ఇవే అపార్ట్‌మెంట్లకు పర్మిషన్ ఇచ్చింది' అని గుర్తుచేశారు. 'నాడు అనుమతులు ఇచ్చిన అధికారులు, కాంగ్రెస్ నాయకులను చెప్పుతో కొట్టొద్దా?' అని నిలదీశారు.మూసీ బఫర్ జోన్‌లో ఇండ్లు ఉన్నాయంటూ అబద్ధాలు చెప్తూ కూలగొడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం, తన సొంత మంత్రులు, తమ పార్టీ ప్రజా ప్రతినిధులకు ఉన్న ఫామ్‌హౌస్‌లు, విల్లాలు, ఇండ్లను ఎందుకు ముట్టుకోవడం లేదని కేటీఆర్ నిలదీశారు. అన్ని అనుమతులతో ఏండ్ల కిందనే కట్టుకున్న ఇండ్లు కూలుస్తున్న ప్రభుత్వానికి, నది నడబొడ్డున నిర్మిస్తున్న బహుళ అంతస్థుల భవనాలు ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. పేదలు, మధ్య తరగతి ప్రజల ఇండ్లను కూల్చితే ఎవరూ అడ్డురారని అనుకుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. మూసీ బాధితుల పక్షాన కేసీఆర్ సైన్యమైన తాము నిలబడుతామని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి లాంటి భూ బకాసురుడి నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని పిలుపునిచ్చారు. మూసీ బాధితులకు న్యాయ పోరాటంలోనూ బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.





# కట్టిన ఇల్లు పెట్టిన పొయ్యి ఇచ్చినం

**బ్యూటిఫికేషన్ కాదు.. లూటిఫికేషన్**
**దేశ సేవ చేసిన మాజీ సైనికులకు**
**ఇదేనా మీరు ఇచ్చే గౌరవం : కేటీఆర్**
**వాస్తవం : రాజేంద్రనగర్**

పదేండ్లు అధికారంలో ఉండి కట్టిన ఇల్లు పెట్టిన పొయ్యి లెక్క బంగారు తెలంగాణను కాంగ్రెస్‌కు ఇస్తే అరాచక పాలనతో ప్రజలపై దౌర్జన్యాలు చేస్తుందని ప్రభుత్వం పై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆదివారం రాజేంద్రనగర్ హైదర్షాకోట్ కేకే నగర్ లో మూసి దండి మార్చ్ కార్యక్రమంలో బాధితులతో కలిసి ఆయన పాదయాత్ర చేశారు. మూడున్నర కిలోమీటర్ల పాదయాత్రలో కేటీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, పార్టీ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి మూసి బాధితుల ఆవేదన వింటూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... పైసా పైసా కూడ పెట్టి కట్టుకున్న ప్రజల ఇండ్లపై బుల్డోజర్లను పంపిస్తా అనడం దిక్కుమాలిన ప్రభుత్వ పాలనకు నిదర్శనమని అన్నారు. ఇండ్లను కూల్చకుండా మూసి సుందరీకరణ చేసేందుకు ఆస్కారం ఉన్నా కక్షపూరితంగా వ్యవహరించడం సిగ్గుచేటు అన్నారు. మా హయాంలో కూడా మూసీ సుందరీకరణలో భాగంగా చాలా ప్రాంతాలలో పార్కుల నిర్మాణం చేశామని చెప్పుకొచ్చారు. నాగోల్ లో ఐదు కిలోమీటర్ల మేర మూసి పరివాహక ప్రాంతాన్ని సుందరీకరణ చేశామన్నారు. కానీ ఏనాడు పేదల ఇండ్ల జోలికి వెళ్లలేదని గుర్తు చేశారు. రాజేంద్రనగర్ మూసి పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలందరూ జిహెచ్ఎంసి తోపాటు అన్ని శాఖల అనుమతులు తీసుకున్నారని అన్నారు. టాక్స్ లు కడుతూ నివసిస్తున్నారని తెలిపారు. మరి అలాంటి ప్రజల గూడును కొల్లగొడితే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సాక్షాత్తు గాంధీ మనువడు ప్రజలకు ఇబ్బందులను కలిగించే విగ్రహం ఏర్పాటు వద్దని చెబుతున్నా ముఖ్యమంత్రి చెవికి ఎక్కడం లేదా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బ్యూటీఫికేషన్ పేరుతో లూటిఫికేషన్ కు తెరలేపారని ఆరోపించారు. 16 వేల కోట్లతో అయ్యే పనికి ఒక లక్ష యాభై వేల కోట్లు ఖర్చు చేయడం ఏంటని మండిపడ్డారు.ప్రజలకు ఇబ్బందులు కలిగించి విగ్రహం ఏర్పాటుకు ఐదువేల కోట్లు ఖర్చు చేయడం ఏంటని ప్రశ్నించారు. మీ పరిసర ప్రాంతాలలో ఎక్కడ బుల్డోజర్లు వచ్చిన అందరు ఐక్యమత్యంగా కలిసి ఎదుర్కోవాలని స్థానిక ప్రజలకు పిలుపునిచ్చారు. హైదరాబాదులో బిఆర్ఎస్ హయాంలో 3866 కోట్ల రూపాయలతో 80 శాతం ఎస్టిపి పనులను పూర్తి చేశామని పేర్కొన్నారు. కానీ ఏనాడు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించలేదని స్పష్టం చేశారు.ఇళ్లను కూల్చకుండా ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నా ప్రభుత్వం క





క్షపూరితంగా వ్యవహరిస్తుందని అన్నారు. హైదరాబాద్ వాసులు కాంగ్రెస్ కు ఓట్లు వేయలేదని 1,50,000 ఇండ్ల ను రేవంత్ రెడ్డి టార్గెట్ చేశారని కేటీఆర్ ఆరోపించారు. దేశ సేవ చేసిన మాజీ సైనికులు, ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఇండ్లు కోల్పోతున్న బాధితులలో ఉన్నారని చెప్పారు.వారికి మీరు ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు.దేశ సేవ చేసిన సైనికుల కుటుంబాలకు ప్రత్యక్ష నరకాన్ని చూపించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.

## వర్గీకరణ పోరాట అమరులకు ములుగులో ఘన నివాళులు

**జిల్లా ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షుడు బుడిగె మహేష్**
**వాస్తవం : గజ్వేల్ ఆర్ సి**

ములుగు మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్,బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాల వద్ద ములుగు ఎమ్మార్పీఎస్ మండల,గ్రామ కమిటీల ఆధ్వర్యంలో మాదిగ అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు.పద్మశ్రీ మందా కృష్ణ మాదిగ నైతృత్వంలో సాగిన ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ ఉద్యమంలో తమ ప్రాణాలను అర్పించిన అమరుల త్యాగాలను స్మరిస్తూ, వారు సాధించిన సాంక్షేమం, హక్కుల పరిరక్షణలో ముందుకు సాగుతామని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిద్దిపేట జిల్లా ఎంఆర్పిఎస్ ఉపాధ్యక్షుడు బుడిగె మహేష్ మాదిగ మాట్లాడుతూ మూడు దశాబ్దాల ఎంఆర్పిఎస్ ఉద్యమంలో ఎస్సీ వర్గీకరణ సాధన కోసం అమరులు తీసుకున్న త్యాగాలు స్ఫూర్తిదాయకమన్నారు.త్యాగాలు లేకుండా ఏ పోరాటం గమ్యాన్ని చేరదు.అమరుల త్యాగాల ఫలితం వర్గీకరణ అని తెలిపారు.అమరుల త్యాగా



లను కొనియాడుతూ,సాధించిన హక్కులను కాపాడడం మన అందరి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షుడు ఆదాస్ మహేష్, మండల ప్రధాన కార్యదర్శి కొమ్ము వినోద్ కుమార్, మండల ఉపాధ్యక్షులు రమణి మల్లేష్,సీనియర్ ఎంఆర్పిఎస్ నాయకులు తూర్పుంటి రాజు, తోడేటి చంద్రయ్య,ఏఐసీసీ రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కడపల నరసింహారెడ్డి, వంటిమామిడి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుతాడి శ్రీనివాస్, కత్తెర స్వాద్, రామగల బాబు, గ్రామ ఎంఆర్పిఎస్ అధ్యక్షులు, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## మాట నిలబెట్టుకున్న భూక్యా భరత్



**వాస్తవం : తిరుమలగిరి**

తిరుమరిగిరి మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా 9వ వార్డు నుండి బిజెపి అభ్యర్థి భూక్య భరత్ నాయక్ రాముని బండ తండావాసులకు ఎన్నికల్లో గెలిచినా ఓడినా సరే ఈదుల పర్రె తండ నుండి రాముని బండ తండ వరకు గుంతల మయమైనటువంటి రోడ్డును మొరం పోయించి చదును చేస్తానని మాట ఇవ్వనైనది. భరత్ మాట్లాడుతూ నేను ఓడిపోయినప్పటికీ ఇచ్చిన మాట ప్రకారం రెండు తండాల మధ్య గల రోడ్డు మరమ్మతు కోసం మొరము పోసి చదును చేపిస్తున్నట్లు తెలిపారు. తాను ఎల్లపుడు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. తిరుమలగిరి మున్సిపాలిటీ 9 వ వార్డులో గల సమస్యలన్నిటిని బీజెపి తరపున ప్రభుత్వము దృష్టికి తీసుకెళ్లి ఆ సమస్యలు పరిష్కరించే దిశగా పోరాటం చేస్తానన్నారు.

## సైనిక్‌లో మెరిసిన సన్ షైన్ స్కూల్ ఆణిముత్యాలు

**వాస్తవం : బాన్సువాడ**

బాన్సువాడ పట్టణంలోని సన్ షైన్ ఇంటర్నేషనల్ స్కూలుకు చెందిన విద్యార్థిని విద్యార్థులు 20 మంది సైనిక్ స్కూల్ కు అర్హత సాధించడంతో పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.మంచి పట్టుదల కృషితో ఎలాంటి కోచింగ్ లేకుండా 21 మందిలో 20 మంది విద్యార్థిని విద్యార్థులు సైనిక్ పాఠశాలకు అర్హత సాధించడం ఎంతో అభినందనీయమని,మంచి క్రమశిక్షణ,కృషితో సైనిక్‌కు అర్హత సాధించారని,విద్యార్థుల శ్రమ,పట్టుదల హర్షించదగ్గ విషయమని ఉపాధ్యాయులు తెలిపారు. కోచింగ్ సెంటర్లకు ఎళ్లి ఎంతో వ్యయ ప్రయాసలకు పాటుపడిన సైనిక్ అర్హత సాధించాలంటే ఎంతగానో శ్రమించాల్సి ఉంటుందని అలాంటిది ఎలాంటి కోచింగ్ లేకుండా సన్ షైన్ పాఠశాల ఉపాధ్యాయులు శ్రమించి అందించిన ప్రోత్సాహం




తో 21 మందిలో 20 మంది అర్హత సాధించడంఎంతో గొప్ప విషయమని పలువురు అభిప్రాయపడ్డారు. సైనిక్ అర్హత సాధించిన విద్యార్థిని విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయులు అభినందించారు. పట్టణంలోని సన్ షైన్ పాఠశాల అనతి కాలంలోనే మంచి పేరును ప్రఖ్యాతలను సంపాదించి విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతుందని పలువురు తెలిపారు. రాబోయే రోజుల్లో విద్యార్థులను మంచి క్రమశిక్షణతో అన్ని రంగాల్లో తీర్చిదిద్దామని ఉపాధ్యాయులు తెలిపారు.



# మాదిగ అమరవీరులకు నివాళి

**అమరవీరుల త్యాగ ఫలితమే ఎస్సీ వర్గీకరణ అమలు**

**వాస్తవం : కోనరావుపేట**

ఎమ్మార్పీఎస్ కోనరావుపేట గ్రామ శాఖ అధ్యక్షులు బొల్లె బాబు మాదిగ ఆధ్వర్యంలో ఆదివారం అంబేద్కర్ దగ్గర అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల బిక్షపతి మాదిగ, కోనరావుపేట మండల అధ్యక్షులు రాజశేఖర్ మాదిగ లు పాల్గొని మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరణ కోసం జరిగిన పోరాటంలో తమ విలువైన ప్రాణాలను అర్పించిన మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం మార్చి 1న తెలుగు రాష్ట్రాల్లో నిర్వహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అమరవీరుల దినోత్సవన్ని మండలంలోని పలు గ్రామాల్లో శివంగలపల్లి గ్రామంలో పరశురాములు మాదిగ ఆధ్వర్యంలో,ఎగ్లాస్ పల్లి గ్రామంలో అక్కనపల్లి సురేష్ మాదిగ ఆధ్వర్యంలో,వెంకట్రావు పేట కుమ్మరి



రవి మాదిగ ఆధ్వర్యంలో,ధర్మారం గ్రామంలో బొడ్డు ప్రభాకర్ మాదిగ ఆధ్వర్యంలో,మర్తన్నపేట గ్రామంలో కలకోట చంద్రయ్య మాదిగ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన పోరాటంలో మాదిగలు 30 సంవత్సరాల తర్వాత వర్గీకరణ సాధించుకున్నా ఈ సాధనలో మాదిగ అమరవీరుల పాత్ర చాలా కీలకమైనదని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల బిక్షపతి మాదిగ మాట్లాడుతూ.... మాదిగ అమరవీరుల ఆశయ సాధన కోసం ముందుకు సాగుతామని తెలిపారు అనంతరం ఎమ్మార్పీఎస్ నాయకులంత అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఎమ్మార్పీఎస్ నాయకులు, కుల సంఘం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇరాన్‌పై అమెరికా సామ్రాజ్యవాదం దుశ్చర్యను ఖండించండి

**సిపిఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య**

**వాస్తవం : గజ్వేల్ ఆర్ సి**

ఇరాన్ దేశంపై సామ్రాజ్యవాద దేశం అమెరికా,ఇజ్రాయిల్ దేశ దాడులను సిపిఎం పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య ఖండించారు. స్వతంత్ర సార్వభౌమాధికారం కలిగి ఉన్న దేశాలపై అమెరికా జోక్యం చేసుకుంటూ దేశాధినేతలను హతమార్చడం, బందీలుగా పట్టుకొని ఆదేశంపై తమ అధిపత్యాన్ని చలాయించడం దుర్మార్గపు చర్యా అన్నారు. ఇరాన్ చమురు నిక్షేపాల కోసం మధ్య ఆసియా దేశంలో తనకు వ్యతిరేకంగా ఉన్నాడని ఇజ్రాయిల్‌తో కలిసి దాడి చేశారనిఅన్నారు. ఇరాన్ పై వేసిన క్షిపణి దాడులలో సుమారు 70 మంది విద్యార్థినులు కలిపి 200 మందికి పైగా మరణించడం జరిగిందని,వెయ్యి మందికి పైగా గాయాలపాలు కావడం జరిగిందని అన్నారు. అమెరికా రక్తదాహానికి సామాన్య ప్రజలుబలవుతున్నారని అన్నారు. తన దేశంలో ఆర్థిక సంక్షోభం నుండి బయటపడడం కోసం ప్రపంచ దేశాలపై పెత్తనం చెలాయిస్తుందని అన్నారు. గతంలో చిలి అధ్యక్షుడు సాల్విడారు అలాండి,ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్,లిబియా అధ్యక్షుడు గడాఫీ, తాజాగా ఇరాన్ సుప్రీం లీడర్ కమేనిని చంపేసిందని అన్నారు. క్యూబా పై ఆంక్షలు విధిస్తూ ఆర్థిక ఇబ్బందులకు గురి చేయడం,వెనిజులా తనకు వ్యతిరేకంగా ఉందని మత్తు పదార్థాలు రవాణా చేస్తున్న కారణంతో వెనిజులా అధ్యక్షులు మధురో,అతని భార్యను సిసిలిని గా తీసుకెళ్లి అమెరికాలో జైల్లో బంధించడం జరిగిందని అన్నారు. ప్రపంచ దేశాల్లో జోక్యం చేసుకుంటున్నా అమెరికా సామ్రాజ్యవాద దుశ్చర్యలను,దాడులను మానవతావాదులు,ప్రజాస్వామిక వాదులు ఖండించాలని పిలుపునిచ్చారు.



## తైక్వాండోలో విద్యార్థుల ప్రతిభ

గోల్డ్ మెడల్ 7

సిర్వల్ సిల్వర్ మెడల్ 6

బ్రాంజ్ మెడల్స్ 12



**వాస్తవం : కోనరావుపేట**

ఉమ్మడి కరీంనగర్ జిల్లా తైక్వాండో పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చూపారు. ఆదివారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని టౌన్ హల్ లో జగిత్యాల జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తైక్వాండో ఛాంపియన్షిప్ 2026 పోటీలకు కోనరావుపేట మండల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి పలు విభాగాల్లో 25 పథకాలు సాధించినట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి,కోచ్ శ్రీనివాస్ తెలిపారు. కయోరుగి (కొట్లాట)లో 3 బంగారు పతకాలు,ఇందులో శరణ్య,వైష్ణవి,రుచిత,విన్యాసాల్లో 6 సిల్వర్ పతకాలు హర్షిత్,రహత్ రాగశ్రీ,మహానవిత్, వర్షిత్,వైష్ణవి సాధించిగా,బ్రాంజ్ పతకాలు శ్రీవర్ధన్, రుత్విక్ పటేల్,మాన్య,మహాన్యాశ్రీ,రిషేంద్ర,నీతిషా, రిషివర్ణిక,శ్రీ శాన్వి,నిత్య,వన్షిక,రచనలు సాధించారు. కొయరిగిలో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు శ్రీనివాస్ పేర్కొన్నారు. పథకాలు సాధించిన విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వ విప్పు ఆది శ్రీనివాస్, ఋషి విద్యానికేతన్ కరస్పాండెంట్ స్వామి దాస్, తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ కోశాధికారి సంతోష్ కుమార్ అభినందించారు.

## రోడ్డు ప్రమాద ఘటనపై కేసు నమోదు

**బాధితులకు ఎఫ్ఐఆర్ కాపీ అందజేసిన ఎస్సై వెంకట్ రెడ్డి**

**వాస్తవం : తిరుమలగిరి**

శనివారం రాత్రి 7 గంటల సమయంలో తిరుమలగిరి మండల కేంద్రంలో రోడ్డు ప్రమాదం సంభవించి మహబూబాబాద్ జిల్లా నరసింహులపేట మండలానికి చెందిన జాటోత్ ప్రవీణ్ అనే యువకుడు మరణించడం జరిగింది. హైదరాబాదు నుండి సొంత గ్రామానికి వెళుతున్న క్రమంలో ద్విచక్ర వాహనం ఢీకొని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాద ఘటనలో జాటోత్ ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనకు సంబంధించి ఆదివారం నాడు తిరుమలగిరి ఎస్సై తుంగతుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రం ఆసుపత్రి వద్ద మృతుని భార్య జాటోత్ శిల్ప నుండి ఫిర్యాదు స్వీకరించి అక్కడికక్కడే కేసు నమోదు చేసి బాధితురాలికి ఎఫ్ఐఆర్ కాపీని అందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎఫ్ఐఆర్ ఎట్ డోర్ స్టెప్ విధానం బాధితుల వద్దే ఎఫ్ఐఆర్ నమోదు కార్యక్రమం బాధితులకు చాలా ఉపయోగపడుతుందని, పోలీస్ స్టేషన్ చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా బాధితుల నుండి పిర్యాదు తీసుకొని నేరుగా ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామన్నారు.








# ఉద్యమ కళాకారుల సంఘీభావ సభ విజయవంతం



వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)

ఉద్యమకళాకారులు, ఉద్యమకారులకు ప్రభుత్వం సబ్ కమిటీ ఏర్పాటు చేసినందుకు కరీంనగర్ పట్టణంలో ఆదివారం సంఘీభావ సభ కార్యక్రమం నిర్వహించగా విజయవంతమైంది.కృతజ్ఞత ర్యాలీ అమర వీరుల స్థూపం నుండి ప్రారంభ మై పిలిమ్ భవన్ వరకు సాగింది.కళాకారులు ఆట పాటలతో దద్దరిల్లింది.ఉద్యమకారులు, ఉద్యమ కళాకారులు తరలివచ్చారు.ఈ కార్యక్రమంలో ఉద్యమ కళాకారుల రాష్ట్ర అధ్యక్షులు చీమ.శ్రీనివాస రావు,ఉపాధ్యక్షులు జ్యోతి రెడ్డి,రాష్ట్ర కళాకారుల అధ్యక్షులు యెల్ల పోశెట్టి, రాష్ట్ర సలహాదారులు బొజ్జ కనకయ్య, ఉత్తర తెలంగాణ కార్యదర్శి. బొడ్డు రాములు, రాజన్న సిరిసిల్ల అధ్యక్షులు. వారాల దేవయ్య, తదితరులు ఉద్యమకారులు,ఉద్యమ కళాకారులు పాల్గొన్నారు.కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాసరావు మాట్లాడుతూ....ప్రతి ఉద్యమం కళా కారునికి గుర్తింపు కార్డు, నివాస స్థలం, హెల్త్ కార్డు తప్పకుండ ప్రతి ఉద్యమ కారునికి అందె వరకు పోరాటం సాగుతుందని, దీనికి ఉద్యమ కళాకారులు వీరొచి తంగా పోరాటం చేయాలి అని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి అధ్యక్షులు మొగిళోజి లక్ష్మీరాజం,కార్యదర్శి బిళ్ళ వెంకట నర్సయ్య. చందుర్తి మండల అధ్యక్షులు దొంగరి లక్ష్మిరాజం,జిల్లా నాయకులు కనపర్తి హనుమన్లు,చిలుముల రమేష్,జిల్లా నాయకులు బుర్రి శంకరయ్య,ఆడెపు ప్రేమ్ చందు,వేములవాడ దుర్గయ్య, కల్లెడ నర్సయ్య,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు

గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి.
ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే
డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్



వాస్తవం : మరిపెడ

గిరిజనుల ఆరాధ్య దైవం సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ అని,బంజారా జాతి ఉనికి,మనుగడ, అభ్యున్నతికి ఆయన ఎనలేని కృషి చేశారని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్ అన్నారు. ఆదివారం సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతిని పురస్కరించుకొని మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో సేవాలాల్ కమిటీ చైర్మెన్ గుగులోత్ రవి నాయక్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించి భోగ్ భండార్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తొలుత గిరిజనులంతా సేవాలాల్ చిత్రపటంతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రత్యేక పూజలు నిర్వహించి భోగ్ బండార్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా భోగ్ బండార్,గిరిజన సంప్రదాయ నృత్యాలు, పలు పాఠశాల లకు చెందిన విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు అందరిని అలరించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మత్తు పానియాలు, హింసకు దూరంగా ఉండాలని, గిరిజనులంతా ఐక్యమత్యంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఒంటికొమ్ము యుగంధర్ రెడ్డి, మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరా రెడ్డి,మరిపెడ మునిసిపాలిటీ చైర్ పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి,వైస్ చైర్ పర్సన్ కాలం సునీతా రవీందర్ రెడ్డి,జిల్లా నాయకులు కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, యువ నాయకులు నూకల అభినవ్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మెన్ ఇస్లావత్ సుధాకర్, వైస్ చైర్మెన్ ఐలమల్లు, జెడ్ పీ సీఈవో పురుషోత్తం, కౌన్సిలర్లు ఇస్లావత్ తిరుపతి, జాటోతు సురేష్, లూనావత్ రమేష్, పానుగోతు రాములు, మెరుగు రాము, కాంతమ్మ, నీలా లచ్చిరాం, గౌతమ్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు షేక్ తాజోద్దీన్, మరిపెడ నాయకులు కొంపెల్లి సురేందర్ రెడ్డి, పానుగోత్ రాంలాల్, గంధసిరి అంబరీష, బుచ్చిరెడ్డి, బోర గంగయ్య, కాంగ్రెస్ నాయకులు, అధికారులు జడ్పీసీఈవో పురుషోత్తం, తహసీల్దార్ కృష్ణవేణి, ఎంపీడీవో వేణుగోపాల్, ఆర్ఐ శరత్ చంద్ర, ఎంపీవో సోమ్లాల్,పాల్గొన్నారు.

# అభివృద్ధికి కృషి చేస్తా

కౌన్సిలర్ ఏనుగు జ్యోతి-తిరుపతి రెడ్డి
నూతన కౌన్సిలర్ ఏనుగు జ్యోతి -తిరుపతి రెడ్డికి రజక సంఘం,గౌడ సంఘం ఘన సన్మానం





వాస్తవం : వేములవాడ

వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని శాత్రాజుపల్లి గ్రామం 2వ వార్డు కౌన్సిలర్‌గా ఎన్నికైన ఏనుగు జ్యోతి-తిరుపతి రెడ్డిని గౌడ సంఘం,రజక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, రజక సంఘం అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు శాలువాతో కప్పి,పూలమాలలతో అభినందించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ ఏనుగు జ్యోతి- తిరుపతి రెడ్డి మాట్లాడుతూ తనను గెలిపించిన వార్డు ప్రజలకు అండగా నిలిచిన సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.విలీన గ్రామమైన శాత్రాజుపల్లిలో 2వ వార్డ్ లో మౌలిక వసతుల కల్పనకు, డ్రైనేజీ, సిసి రోడ్లు, మంచినీటి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు,వార్డు ప్రముఖులు పాల్గొన్నారు.

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు

# వివాహ ఆహ్వాన పత్రిక



మార్కుక్ : వాస్తవం

మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన నాచారం దేవస్థానం మాజీ చైర్మన్ హనుమంతరావు కూతురు జాహ్నవి వివాహం సందర్భంగా ఆదివారం బీఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎర్రవల్లి లోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో మర్యాదపూర్వకంగా కలిసి వివాహ ఆహ్వాన పత్రిక అందజేసి ఈ నెల 6న గజ్వేల్ వైష్ణవి గార్డెన్ లో జరగనున్న వివాహ కార్యక్రమానికి హాజరై ఆశీర్వదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పాండు గౌడ్ తదితరులు ఉన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబాన్ని

# పరామర్శించిన రణం



వాస్తవం : దౌల్తాబాద్

దౌల్తాబాద్ మండలం ముబారస్ పూర్ మాజీ సర్పంచ్ బోట్క శివమ్మ అనారోగ్యంతో మృతిచెందగా ఆదివారం దుబ్బాక నియోజకవర్గ సమన్వయకర్త రణం శ్రీనివాస్ గౌడ్ కుటుంబాన్ని పరామర్శించారు.ఈ సందర్భంగా శివమ్మ గ్రామ అభివృద్ధికి చేసిన సేవలు స్మరించుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఆయన వెంట మండల ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు నాగరాజు,తాజా మాజీ ఎంపీటీసీ తిరుపతి,నాయకులు వైకుంఠం,జనార్ధన్ రెడ్డి,యాదగిరి,అంజిపాల్గొన్నారు.

# వెంకన్న పదవీ విరమణ మహోత్సవం



మాడ్గుల : వాస్తవం

మండల పరిధిలోని కొలుకులపల్లి గ్రామానికి చెందిన పంజు గుల వెంకన్న తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో 1992లో డ్రైవర్ గా పదవీ బాధ్యతలు స్వీకరించి ఫిబ్రవరి 28న పదవి విరమణ పొందారు. ఫలక్నామా రాజేందర్ నగర్ ఇబ్రహీంపట్నం డిపోలో చేసి సహోద్యోగులు, బంధుమిత్రుల, శ్రేయోభిలాషుల సమక్షంలో పదవి విరమణ మహోత్సవం జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్ల గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బట్టు అనురాధ కిషన్ రెడ్డి, నరసయపల్లి సర్పంచ్ కొత్త పాండుగౌడ్, విజయ డైరీ మాజీ చైర్మన్ యాదయ్య వారు సందర్భంగా మాట్లాడుతూ వృత్తి దైవంగా భావించి ప్రజలందరితో కలివిడిగా నడుచుకున్నారని కొనియాడారు. వెంకన్న ఉత్తరమ్మ దంపతుల జీవితం ఆయురారోగ్యాలతో ఐశ్వర్యాలతో నిండు నూరేళ్లు కలకాలం జీవించాలని అభిలాషించారు.

# ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**వెంకటేశ్వర స్వామి,మల్లికార్జున స్వామి కళ్యాణంలో పాల్గొన్న ఆది శ్రీనివాస్**

**వాస్తవం: చందుర్తి**

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుంద ని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.దేవత మూర్తులను దర్శించుకుని ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.. అనంతరం మండలంలోని మల్యాల గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలుపుతూ నూతన వస్త్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణాలు రాష్ట్ర వ్యాప్తంగా శరవేగంగా జరుగుతున్నాయన్నారు.గృహ ప్రవేశ సమయంలో లబ్ధిదారులు మాట్లాడే మాటలు వింటే ఇంత కంటే ప్రజా సేవ ఏం ఉంటదని అన్నారు.ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఆలోచనలు పుణికిపుచ్చుకొని ముందుకు పోతున్నాం అన్నారు.దేశంలో ఇందిరమ్మ ఇళ్లు లేని ఊరు లేదన్నారు.మల్యాల గ్రామంలో సుమారు 60 పైగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు.మూడవ విడతగా మరికొన్ని ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.ఇల్లు లేని ప్రతి ఒక్కరికి ఇల్లు ఇస్తానని అన్నారు.గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ల ఇస్తామని మోసం చేశారని అన్నారు.గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అభివృద్ధిని కొనసాగిస్తానని తెలిపారు.రైతులు అడగక ముందే సాగు నీరు విడుదల చేశామని తెలిపారు. మల్యాల గ్రామస్థులు కోరినట్లు బ్యాంకు మంజూరు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,ఆలయ కమిటీ ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు,లబ్ధిదారులు,భక్తులు పాల్గొన్నారు.





# మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

**ఏబీసీడీ వర్గీకరణ సాధనలో అమరవీరుల త్యాగాలు మరువలేనివి**

**వాస్తవం : ఉప్పల్**

ఉప్పల్ నియోజకవర్గం నాచారం కేంద్రంలో మార్చి 1న మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు.అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి,దీపప్రజ్వలన చేసి,రెండు నిమిషాల మౌనం పాటిస్తూ ఘన నివాళులుఅర్పించారు.కార్యక్రమం అంతటా భావోద్వేగభరిత,గౌరవప్రద వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో ప్రాణత్యాగాలు చేసిన అమరవీరుల త్యాగ ఫలితంగానే ఏబీసీడీ వర్గీకరణ సాధ్యమైందని పేర్కొన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఆవిర్భావం నాటి నుంచి సాగిన ఉద్యమం ఎన్నో అడ్డంకులను అధిగమించి విజయాలను సాధించిందని గుర్తుచేశారు.ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన వారి ఆశయాలను సాకారం చేయడమే నిజమైన నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కేశపాగ రాంచందర్ మాదిగ,ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు పంగ ప్రణయ్ కుమార్ మాదిగ,ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జ్ కోరపాక అంజి మాదిగ, జై భీం వ్యవస్థాపకులు నల్ల బాబు,ఎంజెఫ్ రాష్ట్ర నాయకులు మనోహర్, సీనియర్ జర్నలిస్టు ఎల్ల సంతోష్,గజ్జెల రాంచందర్,శివ పాల్గొన్నారు.



## నీటి కష్టాలు తీర్చిన వేలాల గ్రామ సర్పంచ్



**వాస్తవం : జైపూర్**

జైపూర్ మండలంలోని వేలాల గ్రామపంచాయతీ పరిధిలోని 6వ వార్డులో ఉన్న బోర్వెల్‌కు నూతన మోటార్‌ను శనివారం ఏర్పాటు చేశారు. గ్రామ ప్రజలకు తాగునీటి సరఫరా మెరుగుపరచాలనే ఉద్దేశంతో ఈ చర్యలు తీసుకున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేగ స్వప్న నగేష్,ఉప సర్పంచ్ సుందిళ్ల రాజలింగు, వార్డు సభ్యులు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. బోర్వెల్ మోటార్ తరచూ పనిచేయక ఇబ్బందులు ఎదురవుతుండటంతో గ్రామస్థులు కోరడంతో కొత్త మోటార్ బిగించినట్లు తెలిపారు.నూతన మోటార్ ఏర్పాటు చేయడంతో 6వ వార్డ్ ప్రజలకు తాగునీటి సమస్య తీరుతుందని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధి కోసం మరిన్ని చర్యలు తీసుకుంటామని సర్పంచ్ తెలిపారు.

# పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం

**38 ఏళ్ల తర్వాత కలిసిన చీర్లవంచ మిత్రులు**

**వాస్తవం : వేములవాడ**

వేములవాడ అర్బన్ మండలం అగ్రహారం గ్రామ శివారులోని శ్రీ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం 1987-1988 విద్యాసంవత్సరానికి చెందిన చీర్లవంచ పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు.దాదాపు 38 ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత ఒకే వేదికపైకి చేరుకున్న మిత్రులంత ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. తమ పాఠశాల రోజుల్లో జరిగిన మధుర జ్ఞాపకాలను,చిన్ననాటి అల్లరి పనులను నెమరువేసుకుంటూ ఆనందోత్సాహాల మధ్య గడిపారు.ఈ కార్యక్రమానికి నాటి ఉపాధ్యాయులు మానువాడ శంకర్,ధర్మయ్య,శ్రీనివాస్ రెడ్డిలు హాజరుకాగా,శిష్యులంత కలిసి వారిని ఘనంగా సన్మానించి ఆశీస్సులు తీసుకున్నారు.ఈ ఆత్మీయ కలయికలో బొడ్డు ఆంజనేయులు, నేరెళ్ల అజిత్ కుమార్, దుంద్రపల్లి లక్ష్మీనారాయణ, కడపత్రి వెంకటేశ్వరరావు,బెంగళూరు నుండి విచ్చేసిన నళిని,బిజినెస్ రంగంలో ఉన్న శ్రీధర్ రావు,పోస్ట్ ఆఫీస్ డిపార్ట్మెంట్ నుండి వెంకటేశ్వరరావుతో పాటు వివిధ పోలీస్ శాఖల్లో కానిస్టేబుళ్లుగా,ఇతర ప్రభుత్వ,ప్రైవేట్ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నా ఉన్నత హోదాల్లో ఉన్నా తమ బాల్య స్నేహం చెక్కుచెదరలేదని వారు సంతోషం వ్యక్తం చేశారు.








# పొలంలో నాటు బాంబు పేలుడు

**పాడి గేదెకు తీవ్ర గాయాలు**

**వాస్తవం : ఎల్లారెడ్డిపేట**

ఉమ్మడి ఎల్లారెడ్డిపేట మండలం వీర్నపల్లి మండలం గర్జనపల్లిలో ప్రమాదకర ఘటన చోటుచేసుకుంది. పొలంలో పెట్టిన నాటు బాంబు పేలడంతో మేతకు వెళ్లిన పాడి గేదె తీవ్రంగా గాయపడింది.భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో గ్రామస్తులు ఒక్కసారిగా భయాందోళనకు గురైయ్యారు. గాయపడిన గేదెకు పశువైద్యులు చికిత్స అందిస్తున్నారు. అడవి జంతువుల కోసం ఏర్పాటు చేసిన నాటు బాంబు కావచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



# నీటి లీకేజ్‌తో వ్యాపారాలు స్థంభనం

**మూసీ నది వంతెన సమీపంలో**
**మూడు నెలలుగా తీవ్ర ఇబ్బందులు**
**రాజస్థాన్ మార్బిల్స్ ప్రొప్రైటర్ గిరి రాజు**

**వాస్తవం : ఉప్పల్**



హైదరాబాద్ నగరంలోని నాగోల్ పాయింట్ వద్ద,మూసీ నది వంతెన సమీపంలో గత మూడు నెలలుగా నీటి లీకేజ్,డ్రైనేజీ లైన్ సమస్య తీవ్రంగా కొనసాగుతోంది. గోడౌన్ ముందు భాగంలో భారీ గుంత ఏర్పడటంతో లోపలికి బయటికి రాకపోకలు పూర్తిగా దెబ్బతిన్నాయి ప్రజలు ప్రాణాల్ని పణంగా పెట్టి గుంతను దాటి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయంపై రాజస్థాన్ మార్బిల్స్ ప్రొప్రైటర్ గిరిరాజు మాట్లాడుతూ,నీటి లీకేజ్ కారణంగా నా గోడౌన్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. గత మూడు నెలలుగా వ్యాపారం పూర్తిగా స్థంభించింది. అద్దె సిబ్బంది జీతాలు,కూలీల వేతనాలు చెల్లించాల్సి వస్తున్నప్పటికీ ఆదాయం లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాను అని వాపోయారు. స్థానిక వ్యాపారులు,ప్రజలు ఈ సమస్య ఎప్పుడైనా పెద్ద ప్రమాదానికి దారితీయవచ్చని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి నీటి లీకేజ్,డ్రైనేజీ సమస్యలను పరిష్కరించి రాకపోకలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# సంఘ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా శాఖల సంగమం

**వాస్తవం : ఎల్లారెడ్డిపేట**




ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఆదివారం ఎడ్ల అంగడి సమీపంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాల సందర్భంగా శాఖల సంగమం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మన ఖండ పరిధిలోని ముస్తాబాద్,గంభీరావుపేట,ఎల్లారెడ్డిపేట మరియు వీర్నపల్లి ప్రాంతాలకు చెందిన అన్ని శాఖల స్వయంసేవకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో విభాగ్ సహ వ్యవస్థ ప్రముఖ్ దవునూరి మురళిధర్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశభక్తి భావన ప్రతి ఒక్కరిలో ఉండాలని,భారతీయ సంస్కృతి,సంప్రదాయాలను కాపాడటం ప్రతి భారతీయుడి బాధ్యత అని అన్నారు. సమాజంలో ఐక్యత, సేవాభావం పెంపొందించేందుకు సంఘం నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఖండ కార్యవాహ జిల్లెల్ల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు. వివిధ శాఖలకు చెందిన స్వయంసేవకులు సమిష్టిగా పాల్గొనడంతో కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.

# చర్ల మండలంలో మంత్రి పర్యటన

**30 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన**
**మూడు మండలాల సర్పంచ్లకు సన్మానం**

**చర్ల : వాస్తవం**



చర్లలో ఆదివారం గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటించి, 30 పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు, 10.79 కోట్లతో మారుమూల ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండే వైద్య సేవలను అందించుటము ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకాన్ని కలుగజేయటం వైద్యుల లభ్యత ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ వైద్య సదుపాయాలు ఏర్పాటు చేయటం ద్వారా మారుమూల ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం జరుగుతుంది అని తెలిపారు ఈ పర్యటనలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటు, ఎంపీ బలరాం నాయక్,భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు,జిల్లా కలెక్టర్,ఐటీడీఏ పీవో,ఏ ఎస్ పీ,జిల్లా వైద్యాధికారి,సంబంధిత అధికారులు,స్థానిక ప్రజాప్రతినిధులు,నేతలతో కలిసి వెంకటలక్ష్మి ఫంక్షన్ హాల్ లో జరిగిన సభలో ఆయన ప్రసంగిస్తూ మండలంలోని 30 పడకల ఆసుపత్రి భవన నిర్మాణ పనులను అత్యంత వేగంగా పూర్తి చేసి,ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించడం జరిగింది తెలంగాణ ప్రభుత్వం పేదరిక నిర్మూలన, మహిళా సాధికారత, రైతు సంక్షేమం మరియు సామాజిక భద్రత కోసం పలు పథకాలను అమలు చేస్తోంది. ఆసరా పింఛన్లు, రైతు భరోసా, దళితబంధు, కల్యాణ లక్ష్మి/షాదీ ముబారక్, కిట్, మరియు ఆరోగ్యశ్రీ వంటివి ముఖ్యమైన పథకాలు మహాలక్ష్మి ఇందిరమ్మ ఇల్లు రాజీవ్ ఆరోగ్యశ్రీ అర్హులైన మహిళలకు నెల 2500,ఉచిత కరెంటు గ్యాస్ సిలిండర్ వంటి ఎన్నో పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని,తెలిపారు అనంతరం నూతనంగా ఎన్నికైన సర్పంచులకు సన్మానం చేసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో అధికారులు ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

జన్మదినోత్సవాలు, పదవీ విరమణ శుభాకాంక్షల
ప్రకటనల కోసం సంప్రదించండి
8074124190
వాస్తవం

# కుక్క కరిచిన వ్యక్తికి తీవ్ర గాయాలు



**వాస్తవం : మరిపెడ**

కుక్క దాడిలో వ్యక్తి గాయపడిన సంఘటన మండలంలోని గుండెపుడి గ్రామంలో చోటు చేసుకుంది. ఆదివారం బోడపట్ల మాధవి (40) మిర్చి ఏరిన కూలి పైసలు అడుగుదామని వ్యవసాయ రైతు బింగి వెంకన్న ఇంటి దగ్గరకు వెళ్లారు .అదే క్రమంలో ఇంట్లో ఉన్న కుక్క ఆమె పై దాడి చేసి తీవ్రంగా గాయ పరిచింది. రోడ్డుపై బైకు పై వెళ్తుండగా వాహనదారులను వెంబడిస్తూ ఉంటుందని ఆ దారి గుండా పోయే పాదాచారులను సైతం మొరుగుతూ వెంబడిస్తుందని స్థానికులు తెలిపారు. కుక్క యజమానికి పలుమార్లు గ్రామ పంచాయతీ సిబ్బంది తెలియజేశారు. గ్రామస్తులను ఎలాంటి గాయపరిచిన నేనే బాధ్యత వహిస్తానని గ్రామ సర్పంచ్ కు తెలియజేశాడు.

**కార్తీక్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన**

# బి ఆర్ ఎస్ నాయకులు



**వాస్తవం : రాజేంద్రనగర్**

రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి జన్మదిన వేడుకలను బిఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాజేంద్రనగర్ డివిజన్ సీనియర్ నాయకుడు ఎడ్ల కాడి సూర్యం ఆధ్వర్యంలో స్థానిక నాయకులు కార్తీక్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి, పోయిల జీవన్దాస్, చిత్తారి, గోల్కొండ రాజ్, చంద్రశేఖర్, సుమన్, గౌతమ్, జనార్దన్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

**షేక్ పెట్‌లో ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్‌తో పాల్గొన్న డివిజన్**

# అధ్యక్షుడు సత్యనారాయణ



**వాస్తవం : జూబ్లీహిల్స్**

షేక్‌పేట్‌లోని(జూబ్లీహిల్స్ నియోజకవర్గం) హనుమాన్ దేవాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ నాగదేవత విగ్రహాల ప్రతిష్ట,శివలింగ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ఆదివారం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీ న్ యాదవ్ ముఖ్యఅతిథిగా పూజా కార్యక్రమంలో పా ల్గొని నాగదేవత ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సంద ర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు,అభిషేక కార్యక్ర మాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ మాట్లాడుతూ ఆధ్యాత్మికతతో పాటు సాంస్కృతిక విలువలు పరిరక్షించబడాలని, దే వాలయాలు సమాజానికి శాంతి కేంద్రాలుగా నిలవా లని ఆయన ఆకాంక్షించారు. ఈ పూజ కార్యక్రమంలో షేక్పేట్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు,ప్రజలు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలను విజయవంతం చేశారు.